క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. హైవే నిర్మాణ పనుల్లో భాగంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించి విగ్రహాన్ని చెరువు వద్ద అపరిశుభ్ర ప్రదేశంలో పడేయడంపై ఈ నెల 4న 'ఆంజనేయా...ఏమిటీ దుస్థితి' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమవడంతో ఆలయ నిర్వాహకులు, భక్తులు స్పందించారు. ఎట్టకేలకు ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి,మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం



జలదంకి: మండల రైతాంగానికి కావలి కాలువ నీటిని అందించే మేజర్ కాలువల్లో పూడికతీత పనులను తన సొంత నిధులతో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కావలి కాలువ ద్వారా సాగునీరు విడుదల వుతున్నా సోమవరప్పాడు, కృష్ణాపాడు, బోయిలపాడు, బ్రాహ్మణక్రాక, హనుమకొండపాళెం మేజర్ కాలువల ద్వారా రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. దీంతో మేజర్ కాలువల్లో పూడికతీత పనులను సోమవరప్పాడు మేజర్ కెనాల్ వద్ద వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు.

నిత్యావసరాల పంపిణీ



కావలి: తుపాన్‌నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ సంరక్షణలో ఉన్న చిన్నారులకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. అలాగే ప్రతినెలా పోస్టాఫీసులో చిన్నారుల పేర్లపై నగదు జమ చేస్తున్న పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పేద పిల్లలను సంరక్షిస్తున్న దాతలు డాక్టర్ బీ రాజేంద్రప్రసాద్, రాధ, డాక్టర్ బీ సతీష్, డాక్టర్ పీ ఉషారాణి, డాక్టర్ కే ఆనంద్‌కుమార్, డాక్టర్ టీ మాధవీలత, డాక్టర్ పీ పద్మజ, డాక్టర్ పార్థసారథి రాజు, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ పీ శ్రీధర్, డాక్టర్ కే ఝాన్సీ, ఎం నితిన్‌కుమార్, నిఖిలకు ధన్యవాదాలు తెలిపారు.

పాముకాటు వైద్యుడు మోహన్‌రెడ్డి ఇక లేరు



మోహన్‌రెడ్డి (ఫైల్)

కావలి: గత రెండు దశాబ్దాలుగా కావలి చుట్టుపక్కల ప్రాంతాలవారికి పాము, తేలు కాటుకు ఉచితంగా వైద్యం అందిస్తున్న మూలంరెడ్డి మోహన్‌రెడ్డి (70) ఆదివారం గుండెపోటుతో మరణించారు. కావలిలోని సంకులవారితోటకు చెందిన ఆయన తొలుత అశ్వని చారిటబుల్ ట్రస్ట్ అందించిన తేలుకాటు హోమియో కిట్‌తో వైద్యం ప్రారంభించారు. ఆ తరువాత తన సొంతంగా మందు తయారు చేసి విషసర్పాలతో పాటు తేలు కాటుకు కూడా వైద్యం చేయడం ప్రారంభించారు. తన ఇంటినే వైద్యశాలగా మార్చి పాముకాటుకు అల్లోపతి వైద్యం చేయించుకోలేక వచ్చిన దాదాపు 50వేల మందికిపైగా పేదల ప్రాణాలు కాపాడారు. మోహన్‌రెడ్డి భౌతిక కాయాన్ని పట్టణ ప్రముఖులు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు, సామాజిక కార్యకర్తలు కూనం తాతిరెడ్డి, మాలకొండారెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దాకారపు రవిప్రకాష్, గంధం ప్రసన్నాంజనేయులు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, కావలి రెండో పట్టణ సీఐ గిరిబాబు సంతాపం తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ మాట్లాడుతూ మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి 2014లో రెడ్‌క్రాస్ పురస్కారాన్ని అందజేశామని స్మరించుకున్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ఉదయగిరి: అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఉదయగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఉదయగిరి రేంజ్ అధికారి వీఎస్ కుమారరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో త్యాగాలు మరువలేనివని,వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉదయగిరి రేంజ్ పరిధిలోని అటవీ శాఖ అధికారులు కే మురళి, కే వెంకటప్రసాద్, శ్రీరాములు, చిన్నవెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు వైభవం.. నేడు దైన్యం



కావలి మండలం పూలదొరువు వద్ద ఉన్న జీడిమామిడి తోట

కావలి అటవీ అభివృద్ధి కార్పొరేషన్ గత వైభవాన్ని కోల్పోతోంది. గతంలో జీడిమామిడి తోటల మీదనే ఏటా కోట్లాది రూపాయల లాభాలను ఆర్జించిన ఈ కార్పొరేషన్ నేడు లక్షలకే పరిమితమైంది. ప్రకృతి శాపంతో వర్షాలు సక్రమంగా పడకపోవడం..దశాబ్దాల నాటి చెట్లపైనే ఆధారపడుతూ కొత్త చెట్లను నాటకపోవడం..ప్రభుత్వం నుంచి సహకారం కొరవడడం..తదితర కారణాలతో నేడు దైన్య పరిస్థితులను ఎదుర్కొంటోంది.

కావలి: కావలి కేంద్రంగా ఉన్న అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు(ఎఫ్‌డీసీ) సౌత్‌డివిజన్‌లో 12,495 ఎకరాలు, నార్త్ డివిజన్ పరిధిలో 3వేల ఎకరాలు ఉన్నాయి. సౌత్ డివిజన్‌లో పరిధిలో కావలి, జలదంకి, దుత్తలూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట మండలాలతో పాటు నంద్యాలలో ఉన్నాయి. అలాగే నార్త్ డివిజన్ పరిధిలో కావలి, గుడ్లూరు, ఉలవపాడు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో జీడిమామిడి, జామాయిల్, ఉసిరి, వెదరు, వేపచెట్లు, ఇతర ఔషధ మొక్కలను పెంచుతుంటారు.

జీడీ, జామాయిల్ ప్రధాన ఆదాయ వనరు

కావలి ఎఫ్‌డీసీకి జీడిమామిడి, జామాయిల్ చెట్లు ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్నాయి. కావలి ఎఫ్‌డీసీ పరిధిలో సుమారు 3,450 ఎకరాల విస్తీర్ణంలో జీడిమామిడి తోటలు ఉన్నాయి. 1970–1980 మధ్య కాలంలో జీడిమామిడి మొక్కలను నాటారు. సాధారణంగా జీడిమామిడి చెట్లు 20 ఏళ్ల వరకు మాత్రమే బాగా దిగుబడిని ఇస్తాయి. ఆ తర్వాత దిగుబడి సన్నగిల్లిపోతుంది. కావలి ఎఫ్‌డీసీ పరిధిలో ఉన్న జీడిమామిడి తోటల్లోని చెట్లు దాదాపు 50 ఏళ్ల కింద నాటినవి కావడంతో దిగుబడులు లేక భారీగా ఆదాయం రావడం లేదు. ఒకప్పుడు ఏడాదికి పదుల కోట్ల రూపాయల లాభాలు ఆర్జించగా, నేడు ఏడాదికి రూ.30 నుంచి రూ.40 లక్షలు మాత్రమే లాభాలను పొందుతోంది. అలాగే 9,500 ఎకరాల్లో జామాయిల్‌ను సాగు చేస్తున్నారు. టన్ను కలప ధర రూ.10వేల వరకు పలుకుతోంది. సాధారణంగా ఒక హెక్టార్ అంటే 2.5 ఎకరాల్లోని జామాయిల్ చెట్ల ద్వారా 120 టన్నుల నుంచి 150 టన్నుల వరకు కలప లభిస్తుంది. కానీ వర్షాలు సక్రమంగా పడక చెట్ల పెరగక కావలి ఎఫ్‌డీసీ పరిధిలోని జామాయిల్ తోటల్లో 40 నుంచి 60 టన్నుల వరకు మాత్రమే కలప లభిస్తోంది. దీంతో ఆశించిన లాభాలు రావడం లేదు.

ప్రకృతి శాపంతో..

కావలి ఎఫ్‌డీసీని ప్రకృతి శాపం కూడా వెంటాడుతోంది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో కావలి ప్రాంతంలో ఆశించిన మేర వర్షాలు పడడం లేదు. బంగాళాఖాతంలో ఏర్పడే తుపాన్ల ప్రభావంతో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలో కురిసే వర్షాలు మాత్రమే దిక్కు. ఈ కారణంగా జీడిమామిడి, జామాయిల్ చెట్లు ఆశించిన మేర పెరగడం లేదు. దీంతో ఎఫ్‌డీసీ లాభాలు క్రమంగా తగ్గిపోతున్నాయి.

ఇదీ ఎఫ్‌డీసీ నిర్మాణం

అటవీశాఖలో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఒక భాగం. ఈ కార్పొరేషన్ తన పరిధిలో ఉన్న భూముల్లో చెట్ల పెంచడం, వాటి నుంచి వచ్చే కలప, ఇతర ఫలసాయం ద్వారా లాభాలను ఆర్జిస్తుంటుంది. ఈ నిధులను వృక్ష సంపదను కాపాడడం, కార్పొరేషన్ ఉద్యోగుల జీతాలు, తదితరాలకు ఖర్చు చేయడం జరుగుతుంటుంది. అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వదు. కానీ ప్రభుత్వ పర్యవేక్షణ మాత్రం ఉంటుంది. కార్పొరేషన్ కూడా ప్రభుత్వానికి జవాబుదారీతనంతో ఉంటుంది

వంద ఎకరాల్లో జీడిమామిడి పెంపకానికి చర్యలు

కావలి సౌత్ డివిజన్ పరిధిలో వంద ఎకరాల్లో జీడి మామిడి మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకు సంబంధించి అన్ని రకాల అనుమతుల కోసం ప్రక్రియను వేగవంతం చేశాం.

–ఎస్.పిచ్చయ్య, డివిజనల్ మేనేజర్, కావలి అటవీ అభివృద్ధి కార్పొరేషన్

దుకాణంలోకి దూసుకెళ్లిన ఇసుక టిప్పర్



వరికుంటపాడు: ఇసుక టిప్పర్ అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని భోగ్యంవారిపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు ఇసుక లోడుతో బయలుదేరిన టిప్పర్ భోగ్యంవారిపల్లి కూడలి వద్దకు రాగానే, తిమ్మారెడ్డిపల్లి వైపు నుంచి వస్తున్న కారు అకస్మాత్తుగా రోడ్డుపైకి చేరుకుంది. దీంతో టిప్పర్ డ్రైవర్ కారును తప్పించేందుకు యత్నించగా వాహనం అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దుకాణం ముందు భాగంలోని రేకులు దెబ్బతిన్నాయి. నిత్యం భోగ్యవారిపల్లె కూడలి రద్దీగా ఉంటుంది. ఆదివారం దుకాణాలు తెరుచుకోక జనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఎస్సై రఘునాథ్ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

అన్యాక్రాంతమైన ఆలయ భూములను విడిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

వింజమూరు(ఉదయగిరి): అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను ప్రభుత్వం విడిపించి తిరిగి వాటికే అప్పగించాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రముఖ్ వేములపాటి రవి డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, ఆపస్, బీఎంఎస్, బీజేపీ, ఏబీవీపీ, ధర్మప్రచార సంస్థ క్షేత్రాల ప్రముఖుల సమావేశం వింజమూరులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమతస్తులను తొలగించాలని కోరారు. దేవాలయాల పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాలను హిందువులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజం, హిందూ ఆలయాలపై జరుగుతున్న ఉగ్రదాడులను ఆపాలని, వివాదాస్పద వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో పెద్ద ఎత్తున మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందువులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ క్షేత్రాల ప్రతినిధులు డీ నరసారెడ్డి, ఆర్వీ కృష్ణారెడ్డి, పీ ప్రకాష్, కందల మధుసూదన్‌రెడ్డి, కండే మధు, పీ వెంగయ్య, డేగా మధుయాదవ్, పీ బ్రహ్మయ్య, భాస్కర్, వింజమూరు, కలిగిరి, దుత్తలూరు, కొండాపురం మండలాల్లోని వివిధ క్షేత్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం నిర్మాణం



క్రీడా మైదానం పత్రాలను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవికుమార్, ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి: పట్టణంలోని క్రీడాశాఖ మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం నిర్మాణం చేపడుతామని శాప్ చైర్మన్ అనిమిని రవికుమార్ తెలిపారు. ఉదయగిరి రోడ్డులోని క్రీడాశాఖ మైదానాన్ని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్థానిక ప్రాధాన్యత అంశాలను తెలియజేయగా ఆయన ఆసక్తిగా విన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కావలిలో క్రీడాప్రాంగణం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఖేలో ఇండియా ద్వారా నిధులు సమకూర్చి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సహకారంతో స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా డీపీఆర్‌ను సిద్ధం చేసి స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలిలో స్టేడియం నిర్మాణంపై శాప్ ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. స్టేడియం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కావలిలో క్రీడారంగం అభివృద్ధికి సంపూర్ణ సహాయసహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, జనసేన కావలి పట్టణాధ్యక్షుడు పొబ్బా సాయివిఠల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం




రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తూ క్రీడా జ్యోతిని అందిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్ –17, 19 నెట్‌బాల్ పోటీలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం రాత్రి ప్రారంభించారు. తొలుత రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆర్డీఓ బి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, ఎంపీపీ కే వేణుగోపాల్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, క్రీడా పోటీల ఆర్గనైజర్ పీడీ తిరుపతయ్య, పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి, సురేష్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ఆత్మకూరు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఏపీ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ), ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని 214 మంది రైతులకు రూ.2.55 కోట్ల సబ్సిడీతో సూక్ష్మసేద్యం పరికరాలు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మేడ్ స్ప్రేయర్లు, తదితర పరికరాలను ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి ఆనం ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు అందజేశారు. ఆర్డీఓ బీ పావని, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ జేడీ సుబ్బారెడ్డి, డీడీ సత్యవాణి, ఏపీడీలు రాజశేఖర్, లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, వైస్‌చైర్మన్ సర్దార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు తాళ్లూరి గిరినాయుడు, కే రవీంద్రారెడ్డి, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఐవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందక రైతుల ఆందోళన



అప్పారావుతోట వద్దకు చేరని సాగునీరు

జలదంకి: చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దిగువ ఉన్న గౌరవరం, జలదంకి, బ్రాహ్మణక్రాక మేజర్ కాలువలకు సాగునీరు అందకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. కావలి కాలువకు సాగునీరు విడుదల అవుతున్నా మేజర్ కాలువలకు సాగునీరు అందకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయని, దుక్కులు కూడా చేసుకోలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

వాటర్‌గండిలో మునిగి వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్/వల్లూరు (చెన్నూరు) : కడప నగర శివారు ప్రాంతంలోని వాటర్ గండిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కడప నగరం తిలక్‌నగర్‌లో ఉంటున్న బిల్లపాటి బాబు, తన సమీప బంధువు రవికుమార్‌తో కలిసి విహారయాత్రలో భాగంగా వాటర్ గండి ప్రాంతానికి వెళ్లడం జరిగింది. భోజనం అనంతరం ఈత కొడుతూ బిల్లపాటి బాబు పెన్నా నది ప్రవాహానికి మునిగి మృతి చెందాడు. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా రేవూరు గ్రామానికి చెందిన మృతుడు బిల్లపాటి బాబు ఉపాధి నిమిత్తం కడపకు వచ్చి బంధువుల ఇంట్లో ఉంటున్నట్లు సమాచారం. ఈ మేరకు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పురుషోత్తం తెలిపారు.

అర్జీలు సరే.. పరిష్కారమేదీ?

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసే అర్జీలు పరిష్కారం కావడం లేదు. ప్రజలు విన్నవించే సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలాధికారులు సైతం సమస్యల పరిష్కారంపై చొరవచూపడం లేదు. దీంతో ప్రజలు కలెక్టర్ వద్దకు పరుగులు తీస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆత్మకూరు డివిజన్ నుంచి పెద్దసంఖ్యలో అర్జీలు అందుతుండడమే ఇందుకు నిదర్శనం.



ఆర్డీఓకు అర్జీలను అందజేస్తున్న ప్రజలు (ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజలు సోమవారమైతే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు మొరపెట్టుకునేందుకు బారులు తీరుతున్నారు. వాస్తవానికి చిన్నచిన్న సమస్యలను ఆయా మండల కేంద్రాల్లోనే పరిష్కరించేందుకు ఎంతో అవకాశం ఉంటుంది. కానీ ప్రశాంతంగా సమస్యలను విని పరిష్కరించే తీరిక, ఓపిక మండల స్థాయి అధికారులకు ఉండడం లేదని బాధితులు వాపోతున్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌కు పరుగులు

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో బాధితులు నెల్లూరులోని కలెక్టరేట్‌కు పరుగులు తీసుస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రతిసోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఒక్క అక్టోబరు నెలలోనే ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి 1000కుపైగా అర్జీలు అందాయి. అక్టోబరు 7వ తేదీ 264, 21న 375, 28న 302 అర్జీల వంతున అందినట్లు సమాచారం. ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనంతసాగరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఏకంగా 1445 అర్జీలు అందాయి. అందులో 710కిపైగా అర్జీలు రెవెన్యూ సమస్యలకు సంబంధించినట్లుగా అధికారులు ప్రకటించారు. దీన్ని బట్టి మండల స్థాయిలో ఏ మేరకు సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారో అర్థమవుతుంది. ఇకనైనా మండల, డివిజన్, జిల్లా అధికారులు స్పందించి ఎంతో ఆశతో, నమ్మకంతో అర్జీలు తీసుకుని కార్యాలయాలకు వస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆత్మకూరు ఆర్డీఓ బీ పావనిని సంప్రదించగా తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతిసోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నామని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలను అర్జీలను స్వీకరిస్తున్నామని తెలిపారు. వాటిని శాఖలవారీగా విభజించి ఆయా శాఖల మండలాధికారులకు కేటాయించి ప్రతివారం సమస్యల పరిష్కారంపై తనకు నివేదిక అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అదే క్రమంలో పంచాయతీల వారీగా బృందాలను ఏర్పాటు చేసి ఆయా సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించామని వివరించారు.

మండల యంత్రాంగం విఫలం

మారుమూల గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకుని అధికారులకు సమస్యలపై అర్జీలు అందజేయడం శ్రమతో కూడిన వ్యవహారం కావడంతో ప్రభుత్వం ఆయా మండల కేంద్రాల్లోనే సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన)ను ఏర్పాటు చేసింది. ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తే అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తప్పనిసరిగా అన్ని శాఖల అధికారులు పాల్గొనాలి. అయితే తూతూ మంత్రంగా ఒక్కటి, రెండు శాఖల సిబ్బంది మొక్కుబడిగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీంతో ప్రజలు అందజేసే అర్జీలకు పరిష్కారం దొరకడం లేదు. క్షేత్ర స్థాయిలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్, ఎంపీడీఓలకు ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుంటారు. వారి నమ్మకాన్ని కాపాడేలా మండల స్థాయి అధికారులు, సిబ్బంది గట్టిగా కృషి చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అయితే ఆ దిశగా మండలాధికారులు, సిబ్బంది అర్జీదారులకు నమ్మకం కలిగించడంలో విఫలమవుతున్నారు. అర్జీదారులు రెండు, మూడుసార్లు మండల కార్యాలయాలకు వస్తే ఓపికలేని కొందరు అధికారులు 'ఎండార్స్‌మెంట్' (పరిష్కారం కానిది) అని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపేయడం పరిపాటైంది. దీంతో బాధితులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో కలెక్టర్ వద్దకు పరుగులు తీస్తున్నారు.

అంతర్‌కళాశాలల క్రీడా పోటీలకు ఉదయగిరి విద్యార్థులు



ఉదయగిరి: తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలకు ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం ప్రత్యేక వాహనంలో బయల్దేరి వెళ్లారు. అసోసియేట్ డీన్ బీకృష్ణారెడ్డి జెండా ఊపి వాహనాన్ని పంపించారు. 22 మంది విద్యార్థులు వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, తదితర పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. అధ్యాపకులు గోపీకృష్ణ, దుర్గాప్రసాద్, రమణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగాకు నాట్లు



పొగాకు నాట్లు వేస్తున్న రైతులు

మర్రిపాడు: మండలంలో పొగాకు నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలకు ముందుగా పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేస్తున్నారు. వర్షాలు తెరిపివ్వడంతో పొలాలు ఆరాయి. మళ్లీ వర్షం పడితే పదిరోజుల వరకు పొలాలు ఆరవనే ఉద్దేశంతో రైతులు నాట్లను ముమ్మరం చేశారు. దీంతో పొగాకు నారు, అరకలు, కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. 2024–25 పంట కాలానికి సంబంధించి ఒక బ్యారెన్‌కు 4,275 కిలోల పొగాకు కొనుగోళ్లకు బోర్డు అనుమతించింది. ఆ మేరకు పంట పండించాలని పొగాకు బోర్డు అధికారులు రైతులకు సూచించారు. డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో 2,085 మంది రైతులకు గానూ 1722 బ్యారెన్లు, 12,060 ఎకరాల్లో సాగుకు అనుమతులు ఇచ్చారు. ఇప్పటి వరకు సుమారు 2 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. గతంలో పొగాకు నారు మూట రూ.1500 నుంచి రూ.1800 వరకు ఉండగా, ప్రస్తుతం రైతుల అవసరాన్ని బట్టి రూ.3 వేల నుంచి రూ.3500 వరకు తీసుకుంటున్నారు. ఎకరాలో నాట్లు వేసేందుకు కూలీలకు కాంట్రాక్ట్‌గా రూ.3వేలు చెల్లిస్తున్నారు. విడిగా కూలీలు ఎకరాకు ఏడుగురు నాట్లు వేస్తున్నారు. వీరు కూడా ఒక్కొక్కరు రోజుకు రూ.400 తీసుకుంటున్నారు. కూలీలకు విపరీతంగా డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు కాంట్రాక్ట్ పద్ధతిలోనే నాట్లు వేయించుకుంటున్నారు. మరోవైపు నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు వాటర్ ట్యాంకర్‌కు రూ.వెయ్యి చెల్లించి నాట్లు వేసుకుంటున్నారు. కాగా వేల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు ఆకాశం వంక ఆశగా ఎదురుచూస్తున్నారు. నాట్ల కోసం ఎదురుచూసే వాళ్లు, నాట్లు వేసిన వాళ్లు ఒక్క తడి వర్షం కురిస్తే ఇంక తమ పంటకు ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.

నారుకు డిమాండ్ ఏర్పడింది



ఈ ఏడాది 20 ఎకరాల్లో పొగాకు సాగు చేపడుతున్నా. వర్షం తెరిపిచ్చి అందరూ రైతులు నాట్లకు దిగడంతో నారుకు డిమాండ్ పెరిగింది. దీంతో నారుమడులు పోసిన వారు ధర పెంచేశారు. కొన్నాళ్లు నాట్లు జరిగితే ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టే అవకాశముంది.

–నాగరాజు, రైతు, పొంగూరు